ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గూగుల్ రాక మహర్దశేనా ?

◆ బోలెడు అనుమానాలు ◆ 1000 మెగావాట్ల డేటా సెంటర్‌కు నీటి వనరులేవీ ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో


విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ కొండ పరిసర ప్రాంతాల్లో గూగుల్ ఎఐ డేటా సెంటర్ కోసం వందల ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటికే విలువైన భూములను విశాఖలో టిసిఎస్, సత్వ, కాగ్నిజెంట్, ఎఎన్ఎస్ఆర్ గ్లోబల్ వంటి సంస్థలకు కారుచౌకగా ప్రభుత్వం కట్టబెట్టింది. ఎకరా భూమిని 99 పైసలకు ఇచ్చేసిన వైనం అప్పట్లో చర్చనీయాంశమైంది. చౌకగా భూములు తీసుకున్న సంస్థలు గడిచిన కాలంలో అనుకున్న స్థాయిలో ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో 'గూగుల్' ఒప్పందం పేరిట ప్రభుత్వం చేస్తున్న ప్రచారంపైనా బోలెడు అనుమానాలున్నాయి.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖ జిల్లాలో 300 ఎకరాలకుపైగా ప్రభుత్వం ఇచ్చేందుకు నిర్ణయించింది. దీనికి సంబంధించిన సమావేశం ఢిల్లీలో మంగళవారం జరిగింది. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ



వైష్ణవ్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి మంత్రి నారా లోకేష్, గూగుల్ ప్రతినిధులు హాజరై ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్న అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది. సుమారు రూ.87,520 కోట్లతో ఏర్పాటు చేయబోయే గూగుల్ ఎఐ డేటా సెంటర్‌తో 1.8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వ పెద్దలు చెప్పడం తెలిసిందే. గూగుల్ మిగతా 2లో..

ఎఐ డేటా సెంటర్‌తో ఉద్యోగాలు వస్తాయా ?



ఒకవైపు మన దేశంపై అమెరికా టారిఫ్‌ల యుద్ధం ప్రకటించింది. అక్కడి కంపెనీలు ఉద్యోగాలిస్తాయంటూ స్వాగతించడంలో అర్థం ఉందా?. ఎఐ కంపెనీలు, డేటా సెంటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ని వినియోగిస్తున్నాయి. ఉద్యోగులను తొలగిస్తున్నాయి. 2014-19 మధ్య కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు ఉపాధి కల్పనపై ఇచ్చిన హామీలు ఎక్కడ అమలయ్యాయి ?. ఇప్పుడు మళ్లీ గూగుల్ ప్రచారం ఏమిటి ?. గూగుల్‌కు స్థావరమైన అమెరికాలోనే నీటి కొరత కారణంగా కొన్ని రోజుల క్రితం అక్కడి ప్రజలు ఎఐ సెంటర్‌పై పోరాటం చేసి మూసివేయించడం నిజం కాదా?. ఇదే విషయాన్ని నేను సిఎం చంద్రబాబుకు రాసిన లేఖలోనూ తెలియజేశాను.

ఇఎఎస్.శర్మ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి



ప్రమాదంతో అలుముకున్న దట్టమైన పొగ

స్టీల్ ఆర్ఎంహెచ్‌పిలో అగ్ని ప్రమాదం

◆ భారీగా ఆస్తినష్టం

◆ వరుస ఘటనలతో కార్మికుల్లో భయాందోళన

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం మరో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్ఎంహెచ్‌పి డిపార్టుమెంట్‌లో కూల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే.. థర్మల్ పవర్ ప్లాంటుకు అవసరమైన బాయిలర్ కోల్‌ను సీసీ 31 కన్వేయర్ ద్వారా పంపించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం బొగ్గు కాలిపోతోందని, ఆర్పిన తర్వాత పంపుతామని అక్కడ వారు చెప్పినప్పటికీ వారు వినలేదు. ఎలా ఉన్నా సరే వెంటనే పంపించాలని అధికారులు హుకుం జారీ చేశారు. చేసేదేమీ లేక మండుతున్న బాయిలర్ కోల్‌ను పంపించారు. ఆ కోల్ మంటలకు యార్డ్ కన్వేయర్ బెల్టు తెగిపోయి ఆగిపోయింది. స్కట్ రబ్బర్లు, ఐరన్ ప్లేట్లు వేడికి వంగిపోయాయి. భారీగా నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. మూడు నెలలుగా యార్డులో బాయిలర్ కోల్ తగలబడుతూ కోట్ల రూపాయల నష్టం మిగతా 2లో..

'గూగుల్' ఒప్పందంపై సంబరాలు

▶ వార్త 5లో..

డాక్టర్ రాచకొండ నరసింహాశర్మ కన్నుమూత

▶ వార్త 2లో..

16 నుండి19 వరకు గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్

▶ వార్త 2లో..

విశాఖలో మరో హనీ ట్రాప్ ఉదంతం

◆ సన్నిహితంగా ఉంటూ రూ.86 లక్షలు దోచిన మహిళ

◆ సిపిని ఆశ్రయించిన తెలంగాణ యువకుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో మరో హనీ ట్రాప్ ఘటన వెలుగు చూసింది. సన్నిహితంగా ఉంటున్నట్టు నటించి తెలంగాణా యువకున్ని ఓ యువతి దోచేసిన ఘటన ఆలస్యంగా మంగళవారం బయటపడింది. గతేడాది పోస్టల్ శాఖ అధికారి ఇంట్లో చోరీకి పాల్పడిన మహిళే ఇప్పుడు ఈ మోసానికి పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. విచిత్రం ఏంటంటే ఆమె భర్తతో సహా కుటుంబ సభ్యులంతా ఈ దందాలో భాగస్వామ్యమైనట్టు చెబుతున్నారు. తాను పోలీస్ కేసులో ఇరుక్కున్నానని, సహాయం చేయాలని విశాఖలోని చినముషిడివాడకు చెందిన సదరు 'హనీ' తెలంగాణా వాసిని పరిచయం చేసుకుంది. తరువాత మోసం చేసింది. దీంతో బాధితుడు తాజాగా విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చీని ఆశ్రయించాడు. నిందితురాలు వేరే వ్యక్తి ద్వారా పరిచయం అయిన బాధితుడిని వలలో వేసుకుని, నగలు, బంగారం దోచేసిన వైనంపై ఆరా తీయాలని సిపి పెందుర్తి పోలీసులను ఆదేశించినట్టు సమాచారం. మూడంటే మూడు నెలల్లో రూ.86 లక్షలను బాధితుడు ఆమెకు ఇచ్చి మోసపోయినట్టు తెలిసింది.

హెచ్ఎస్ఎల్‌కు మినీ రత్న హోదా



▶ వార్త మెయిన్‌లో..

అన్ని గురుకులాల్లో ఆర్ఓ ప్లాంట్లు

◆ రూ.90 కోట్లు మంజూరు

◆ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని, అందుకోసం రూ.90 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా మంజూరు చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం కెజిహెచ్‌కు వచ్చిన ఆమె ముందుగా అక్కడ పచ్చకామెర్లతో బాధపడుతూ చికిత్స పొందుతున్న కురుపాం గురుకుల విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ టాయిలెట్స్ కారణంగా పచ్చ కామెర్లు వచ్చాయన్నారు. అక్కడ ఆరు వందల మందికి 30 టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు టాయిలెట్స్ కడుతున్నామన్నారు. పచ్చకామెర్ల



విద్యార్థిని పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

వ్యాధితో మృత్యువాత పడిన పిల్లలకు నష్ట పరిహారం ఇవ్వడంపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారన్నారు. చనిపోయిన పిల్లలకు మట్టి ఖర్చులు ఇచ్చామన్నారు. కెజిహెచ్‌లో ఇంకా ఆరుగురు పిల్లలు చికిత్స పొందుతున్నారని, వారిలో ఒక బాలికకు సికిల్‌సెల్ అనీమియా ఉందని అన్నారు. కురుపాం గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య లేదన్నారు. కెజిహెచ్‌లో వైద్యులు పిల్లలను చాలా బాగా చూసుకున్నారని కొనియాడారు. పిల్లల ఆరోగ్యం బాగోకపోతే రాజకీయం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

గూగుల్ రాక మహర్దశేనా ?

కంపెనీ సొంతంగా సోలార్ ప్లాంట్‌ను స్థాపించి తనకు కావాల్సిన విద్యుత్‌ను ఉత్పత్తి చేయబోతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అందుకోసం వందల ఎకరాల భూమి అవసరమవుతుంది. ఈ క్రమంలో పర్యావరణ సమస్యలు తలెత్తనున్నాయి. వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో గూగుల్ సేవలు అందిస్తుందని, విశాఖ నుంచి సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియా దేశాలతో సబ్ సీ-కేబుల్ ద్వారా ఎఐ డేటా సెంటర్ అనుసంధానం కానుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధినేతలు ఈ సందర్భంగా వెల్లడించారు.

నీటిని ఎక్కడ నుంచి ఇస్తారు ?

1000 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే గూగుల్ కంపెనీకి ఎక్కువ మొత్తంలో నీరు అవసరం. నేడు విశాఖ ప్రజలకే తాగునీరందించలేని పరిస్థితి ఉంది. సుమారు 2.7 - 4.1 మిలియన్ గ్యాలన్ల నీరు గూగుల్‌కు రోజుకు అందిస్తే తప్ప నడవడం సాధ్యం కాదని తెలుస్తోంది. జివిఎంసి ద్వారా ఆ నీటిని సరఫరా చేస్తే విశాఖ ప్రజలకు తాగునీరు కొరత ఏర్పడి తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రోజుకు జివిఎంసి ద్వారా 84 ఎంజిడి (మిలియన్ గ్యాలన్ పర్ డే)ను మాత్రమే నగరానికి ఇస్తున్నారు. వాస్తవానికి విశాఖ ప్రజల తాగునీటి కొరత తీరాలంటే 124 ఎంజిడి ఇవ్వాల్సి ఉంది. విశాఖ ప్రాంతంలో ఉన్న రిజర్వాయర్ల నుంచి లభించే నీరు, ఏలేరు, పోలవరంలను పరిగణలోకి తీసుకున్నా సరే అతివేగంగా పెరుగుతోన్న విశాఖ జనాభాకు తగ్గట్టుగా నీరు ఎక్కడ నుంచి తెస్తారన్నది డిపిఆర్‌లో పేర్కొనబడలేదు.

స్టీల్ ఆర్ఎంహెచ్‌పిలో అగ్ని ప్రమాదం

వాటిల్లుతున్నా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సరైన శ్రద్ధ తీసుకోవడం లేదు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మోడీ సర్కారు చేసినప్పటి నుంచీ కార్మికుల తొలగింపు, కుదింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఉన్నవారిపై పని ఒత్తిడి పెరిగింది. విభాగాలు నిర్వీర్యమవుతున్నాయి. దీంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్మికులు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితమే ప్లాంట్ కోకోఓవెన్ విభాగంలో ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే.

అన్ని గురుకులాల్లో ఆర్ఒ ప్లాంట్లు

చెయ్యడం ఏంటని పార్టీలను ప్రశ్నించారు. 146 మంది పిల్లలు బాగా ఉన్నారని తెలిపారు. అన్నీ తెలుసుకోడానికి తనకు కాల జ్ఞానం లేదన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే, తమకు చెప్తే సరి చేసుకుంటామన్నారు. ఆమె వెంట కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తదితరులు ఉన్నారు.

22 నుండి ప్రత్యేక బస్సులు



ఆర్ఎం అప్పలనాయుడు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ నెల 22 నుండి కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలను దర్శించే భక్తుల ప్రయోజనం కోసం పంచారామ క్షేత్రదర్శిని పేరుతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు విశాఖ జిల్లా ప్రజారవాణా అధికారి అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. . కార్తీకమాసంలో వచ్చే ప్రతి ఆదివారం సాయంకాలం 5 గంటలకు ద్వారకా బస్సు స్టేషన్ కాంప్లెక్స్ నుండి ప్రత్యేక బస్సులు బయలుదేరి మరునాడు సోమవారం మొదట అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట,ఒకే రోజున పై ఐదు ప్రముఖ శైవక్షేత్రాలను దర్శించే అద్భుత అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. బస్సులు ఈ నెల 25, 26, నవంబర్ 1,2,8, 9,15, 16వ తేదీల్లో విశాఖ ద్వారకా బస్సు స్టేషన్ కాంప్లెక్స్ నుండి బయలుదేరుతాయన్నారు. అలాగే, ఈ మాసంలో ఏ రోజైనా కూడా ప్రయాణీకుల కోరిక మేరకు ఈ పంచారామాల స్పెషల్ బస్సులు నడపబడతాయన్నారు. ప్రయాణఛార్జి ఒక్కరికి, సూపర్ లగ్జరీ రూ.2200, అల్ట్రాడీలక్స్ రూ.2150, ఇంద్ర రూ.2800. టికెట్స్ కావలసిన వారు ఆన్‌లైన్‌లో https://www.apsrtconline.in వెబ్‌సైట్‌లో విశాఖపట్నం పంచారామాలు రూట్ సెలెక్ట్ చేసి సీట్స్ రిజర్వ్ చేసుకోవచ్చు అన్నారు.

లంబసింగిటూర్

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని లంబసింగికి ప్రత్యేకబస్సులు నడుపబడతాయన్నారు. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్సుస్టేషన్ నుండి బయలుదేరుతాయని, లంబసింగి,తాజంగి డ్యామ్, కొత్తపల్లివాటర్‌ఫాల్స్, మోదమాంబగుడి (పాడేరు), కాఫీతోటలు చూపించబడతాయన్నారు. ప్రయాణఛార్జి ఒక్కరికి అల్ట్రాడీలక్స్ రూ.800, ఎక్స్ ప్రెస్ రూ.650


ధారమట్టం

కార్తీకమాసం సందర్భంగా ధారమట్టం టూర్‌కు ప్రత్యేక బస్సులు నడుపబడతాయన్నారు. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకాబస్‌స్టేషన్ నుండి బయలుదేరుతాయన్నారు. శివాలయం, ధారమట్టం వాటర్‌ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్న కొండ (అనకాపల్లి) ప్రయాణ చార్జి ఒక్కరికి సూపర్‌లగ్జరీ రూ.650, ఎక్స్‌ప్రెస్ రూ.550. అదేవిధంగా శబరిమలై కి కూడా బస్సులు నడుపబడతాయని తెలిపారు.

టిక్కెట్లు కావలసినవారు ఆన్లైన్‌లో బుక్‌చేసుకొనవచ్చని, ద్వారకా బస్సుస్టేషన్, విశాఖపట్నం రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా బుక్ చేసుకొనే సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నెంబర్లతో సంప్రదించవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాల్సిందిగా అప్పలనాయుడు కోరారు. ఇవే కాకుండా కార్తీకమాసంలో విజ్ఞాన విహారయాత్రలకు అద్దెప్రాతిపదికన బస్సులు ఇవ్వబడతాయన్నారు.

ప్రముఖ కవి, అనువాదకులు

డాక్టర్ రాచకొండ నరసింహశర్మ కన్నుమూత



నరసింహ శర్మ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రముఖ కవి, అనువాదకులు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ మంగళవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 101 సంవత్సరాలు. ప్రముఖ కథా, నవలా రచయిత రావిశాస్త్రికి ఆయన తమ్ముడు. డాక్టర్ నరసింహ శర్మ అమెరికాలో 40 ఏళ్లు వైద్య వృత్తి నిర్వహించారు. భారత దేశానికి తిరిగి వచ్చాక 10 కవితా సంపుటాలు వెలువరించారు. వంద మందికిపైగా ఆంగ్ల కవుల కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. డాక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎన్.గోపి మొదలైనవారి తెలుగు కవితలను ఆంగ్లంలోకి అనువదించారు. ప్రతి ఏటా రావి శాస్త్రి పురస్కారాన్ని ప్రముఖ రచయితలకు ప్రదానం చేస్తున్నారు. నరసింహ శర్మ మృతి పట్ల వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, డాక్టర్ గండికోట రఘురామారావు, సూర్యారావు, మంగు శివరాం ప్రసాద్, కె.సర్వేశ్వర ప్రసాద్, శేఖరమంత్రి ప్రభాకర్, పలువురు సాహితీవేత్తలు సంతాపం ప్రకటించారు.

సిఐ శ్రీనివాస్‌కు సన్మానం

ప్రజాశక్తి- కొయ్యూరు: నూతనంగా నియమింపబడ్డ సిఐ శ్రీనివాస్‌ని కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొయ్యూరు, మంప పోలీస్‌స్టేషన్లకు శ్రీనివాస్ సిఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఎంపిపి రమేష్ కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. తదుపరి మండలంలో పలు విషయాలపై చర్చించారు. వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ, సర్పంచులు రీముల శ్రీను, కోడా రాజబాబు, కుశల, నాగేంద్ర, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

16 నుండి 19 వరకు గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 16 నుండి 19 వరకు గ్రేట్ వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్-2025 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిరప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ డిఎస్‌టి సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా గ్రేట్‌వైజాగ్ షాపింగ్ ఫెస్టివల్ కార్యక్ర మాన్ని తొలివిడతగా బీచ్‌రోడ్డులో నిర్వహించామని, రెండో విడత ఈ ఫెస్టివల్ ను ఎయు ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16 నుండి 19 వరకు, ప్రతిరోజు ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తున్నా మన్నారు. మొత్తం 66 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వీటిలో ఆటో మొబైల్స్19 స్టాల్స్, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫర్నీచర్ 11, ఆహారం, పానీయాలు 5, స్వయం సహాయకబృందాలు 25, ఇతరాలు 6, మొత్తం 66 స్టాల్స్ నిర్వహించ బడతాయన్నారు. ఉత్సవంలో స్థానిక కళ, నృత్యం,సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లక్కీడిప్ డ్రాలు నిర్వహించబడ తాయని, సందర్శకుల కోసం ఫుడ్ కోర్టులు,పార్కింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక వ్యాపారాలు, స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించడం, జిఎస్టి డిజిటల్ లావాదేవీల ప్రయోజనాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యం అన్నారు. అనంతరం ఫెస్టివల్ కు సంబంధించిన పోస్టర్‌ను స్టేట్ జిఎస్‌టి అదనపు కమిషనర్ శేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, టూరిజం అధికారి మాధవి, హోటల్స్ అండ్ టూరిజం అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ పాల్గొన్నారు

అభివృద్ధిని ఓర్వలేకే వైసిపి దుష్ప్రచారం

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖకు ఐటి దిగ్గజ సంస్థలు వస్తున్నాయని రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండిబాబ్జి అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఫి డేటా సెంటర్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారని, తద్వారా విశాఖ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు.

డేటా సెంటర్లుకు విశాఖలో అనుకూల వాతావరణం ఉందన్నారు. విశాఖలో, రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆరోపించారు.

చంద్రబాబుకు చెడ్డ పేరు తేవాలనే ఉద్దేశ్యంతో కల్తీ మద్యాన్ని వైసిపి వారే తయారు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధి, ప్రతిపక్షానికి కనబడడం లేదా అని ఎద్దేవా చేశారు. రుషికొండలో ప్రజాధనం దుర్వినియోగం చేసి ప్యాలెస్ నిర్మించారన్నారు. టిడిఆర్ ల విషయంలో ప్రభుత్వం ఉపేక్షించడం లేదన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- పద్మనాభం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పద్మనాభం తహశీల్దార్ కాకర ఆనందరావు తెలిపారు. బాధ్యతలు చేపట్టి ఏడాదైన సందర్భంగా మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకు పిజిఆర్ఎస్‌లో సుమారు 952 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 872 పరిష్కరించామని తెలిపారు. మండలంలో 25 గ్రామాలు ఉండగా గత ఏడాది 17 గ్రామాలకు రీసర్వే పూర్తిచేశామని చెప్పారు. ప్రస్తుతం గంధవరం పూర్తయిందని, కొవ్వాడ పంచాయతీలో గ్రౌండ్ లెవెల్ రీ సర్వే పూర్తయిందని వివరించారు. పాండ్రంగి, పొట్నూరు, రెడ్డిపల్లి గ్రామాలలో రీ సర్వే ప్రారంభించామని తెలిపారు. మండలంలోని ప్రైవేట్ భూములు చాలావరకు క్రయవిక్రయాలు జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్లు జరగకపోవడం వల్ల ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని, అలాంటి భూములకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పిజిఆర్ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులలో ఎక్కువ ఇటువంటి భూ సమస్యలేనని వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ బ్యాంకింగ్ ప్రారంభించామని తెలిపారు. కృష్ణాపురంలో ఎంఎస్ఎంఇ పార్క్ కోసం సుమారు 65 ఎకరాలు సేకరించినట్లు చెప్పారు. కొవ్వాడలో ల్యాండ్ పూలింగ్ విఎంఆర్‌డిఎ టౌన్‌షిప్ కోసం 250 ఎకరాలను సర్వే నెంబర్ 237లో భూ సేకరణ చేపట్టామని, అందులో రస్తాలు గెడ్డలు కొండవాలు ప్రాంతాలు తీసేయగా సుమారు రైతులు అనుభవంలో ఉన్న ల్యాండ్ 150 ఎకరాలుగా గుర్తించామని వివరించారు. ఈ 150 ఎకరాలకు గాను 253 మంది రైతులను ప్రాథమిక దశలో గుర్తించామని తెలియజేశారు. ఆ సర్వే నెంబర్‌లో ఉన్న రైతులు కొవ్వాడ, కాటికపల్లి గ్రామానికి చెందిన రైతులుగా గుర్తించి, వారికి గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించామని తెలిపారు. అభ్యంతరాలను, ఇతర సమస్యల పరిష్కారానికి రెండు నెలలు సమయం ఇచ్చినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25 తర్వాత ఆ గ్రామాల రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసి ఆర్‌డిఓ సమక్షంలో ల్యాండ్ పూలింగ్ పూర్తి చేయనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు కొవ్వాడ గ్రామం నుంచి 28 అభ్యంతరాలు వచ్చినట్లు తెలిపారు. ఈ ల్యాండ్ పూలింగ్ విషయంలో మధ్యవర్తులను నమ్మి రైతులు బలి కావద్దని, నిజమైన రైతులు మోసపోవద్దని, అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. ఫిర్యాదులను గ్రామస్థాయి నుంచి ఆర్‌డిఓ స్థాయి వరకు ఇవ్వొచ్చని తెలిపారు. పద్మనాభం మండలం చెన్నై కారిడార్‌కు, ఎకనామికల్ కారిడార్‌కు సుమారు రెండు గంటల ప్రయాణ దూరంలో అందుబాటులో ఉండటంవల్ల అభివృద్ధి వేగం పుంజుకుంటుందని వివరించారు. ఈ సమావేశంలో ఆర్ఎస్‌డిటి శ్రీనివాసరావు, హెచ్‌డిటి చంద్రశేఖర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ మృతి కేసులో రెండేళ్ల జైలు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఆటో డ్రైవర్ మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనందుకు మరో ఐదు వేలు జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి... నిందితుడు ఎ.ఆనంద్ (60) నగరంలోని బీచ్ రోడ్‌లో ఉంటున్నాడు. గత ఏడాది ఏప్రిల్ 8వ తేదీన నిందితుడు ఆనంద్ పూర్ణా మార్కెట్ ప్రాంతానికి తన పియట్ కార్‌లో వెళ్లాడు. దుర్గాలమ్మ గుడి దగ్గర ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో వ్యక్తికి, రోడ్డుపై నడుస్తున్న యువకునికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భార్య అప్పలకాంతం ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వనాథం నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 304 ఎ, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పుచెప్పారు.

శివశక్తినగర్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి- కొమ్మాది : జివిఎంసి ఐదవ వార్డు పరిధి శివశక్తి నగర్ రోడ్డులో హైఫ్రెష్ చర్చి వద్ద బొట్టు తిమోతి ఆధ్వర్యంలో గీతం హాస్పిటల్ సహకారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం, బిపి, కంటి, దంత పరీక్షలను గీతం హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్ చేశారు. మహిళలకు ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక సలహాలు, పిల్లలకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మెల్లి హేమలత, జనసేన నాయకులు ఇమ్మంది శ్రీనివాస్, సతీష్, కారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 11 మంది బెస్ట్ విద్యార్థులకు గ్రామ పెద్ద సిరుగుడి ఈశ్వరరావు సొంత నిధులతో సమకూర్చిన క్రీడా దుస్తులను మంగళవారం పాఠశాలలో అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రగ్బీ లీగ్ పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక మినీ క్రికెట్ స్టేడియం వేదికగా మహిళలకు మంగళవారం రగ్బీ లీగ్ పోటీలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 130 మంది 18 ఏళ్ల పైబడిన మహిళా క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారు ఎపి జట్టుకు ఎంపిక అవుతారని నిర్వాహకులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అస్మిత పేరుతో దేశంలోని పలు ప్రాంతాల్లో రగ్బీ లీగ్ పోటీలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ పోటీలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మన రాష్ట్రంలో ఏటా మినీ సబ్ జూనియర్, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలో క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, ప్రకృతి స్కూల్ కరస్పాండెంట్ వి.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు హర్ష వర్ధన్, రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు లలిత్ కుమార్, కార్యదర్శి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు నల్ల శ్రీనివాస్, సభ్యులు మురళి తదితరులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జివిఎంసి సాధారణ నిధులు రూ.80.95 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. మూడో వార్డు పరిధి తోటవీధి, కృష్ణాకాలనీ, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, సిబిఎం స్కూల్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, పార్టీ నాయకులు గంటా నూకరాజు, సంజీవ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఒబిఎం మోటార్ల పంపిణీ

జివిఎంసి మూడో వార్డు పరిధి ఎగువపేటకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం సబ్సిడీపై బోట్ బోర్డు మోటార్లను (ఇంజన్లు) ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎఫ్‌డిఓ ఆర్.ఈశ్వరరాజు, విఎఫ్ఎ సుమంజలి, ఎగువపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కారి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల పరిశీలన



కొండవాలు ప్రాంతాలను పరిశీలిస్తున్న జెడ్‌సి

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్, అయ్యప్పనగర్‌లోని కొండవాలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎంఒహెచ్ రాజా రవికుమార్ మంగళవారం పర్యటించి పరిశీలించారు. పారిశుధ్య పనులను దగ్గరుండి సిబ్బందితో చేయించారు. ఈ పర్యటనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు.

కార్పొరేటర్ కృషితో చర్యలు

ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా శారద నగర్, అయ్యప్ప నగర్ కాలనీల పరిధిలో కొండ చర్యలు విరిగి పడడంతో ఆందోళన చెందిన ప్రజలు సమస్యలను స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆమె మంగళవారం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, డిఇ మణికుమార్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొండవాలు ప్రాంతాలలో తక్షణమే రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. లేకుంటే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, ప్రాణహాని దృష్ట్యా త్వరితగతన చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం పరిశీలించి అంచనాలను రూపొందించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు నల్లాన ఆనందరావు, దేవర శివ , రమణమ్మ, స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న...

హత్యకేసు నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఒక హత్య కేసులో కోర్టుకు హాజరు కాకుండా వివిధ ప్రాంతాల్లో నివసిస్తూ, ప్రాంతానికి ఒక వృత్తి ఎంచుకొని ఆరేళ్లుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ప్రధాన నిందితుడిని ఎట్టకేలకు ఆరిలోవ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎసిపి నర్సింహమూర్తి ఆరిలోవ సిఐ సిహెచ్ మల్లేశ్వరరావుతో కలిసి మంగళవారం ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 2011 జూన్ 6న ఆరిలోవ బాలాజీనగర్ సెయింట్ ఆన్స్ స్కూలు వెనుక భాగంలో బాలాజీనగర్ ప్రియదర్శిని కాలనీకి చెందిన తిరుమలరాజు రాఘవరాజు అలియాస్ టింకు మరో ఆరుగురితో కలిసి ఆరిలోవకు చెందిన పందిరి రవి అలియాస్ (చిత్తిని రవి)ని పాత కక్షల కారణంగా కత్తులతో దాడి చేసి నరికి చంపేశారు. రవి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు అప్పట్లో ఏడుగురి అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచారు. వారిపై రౌడీ షీట్ కూడా తెరిచారు. అప్పటి నుంచి కోర్టులో ట్రయల్ నడుస్తుంది. ఇదిలా ఉండగా 2019 జులై 14 నుంచి ప్రధాన నిందితునిగా ఉన్న తిరుమలరాజు రాఘవరాజు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. 2023లో మిగిలిన 6 గురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేసింది. వీరిలో ముగ్గురు చనిపోగా, మరో ముగ్గురు శిక్ష అనుభవిస్తున్నారు. ప్రధాన నిందితునిగా ఉన్న తిరుమలరాజు రాఘవ రాజు మాత్రం 2019 నుంచి సెల్ ఫోన్ సిమ్‌లు మార్చుతూ, వేర్వేరు ప్రాంతాలకు మకాం మారుస్తూ వివిధ పనులు చేస్తూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఆరిలోవ ప్రస్తుత సిఐ సిహెచ్.మల్లేశ్వరరావు ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని ఎస్ఐ రామదాసు, శంకర్, వరహాలనాయుడు, అప్పారావుతో బృందాన్ని ఏర్పాటుచేసి మఫ్టీలో తిరుగుతూ ఫోన్ సిగ్నల్స్ ద్వారా మంగళవారం అనకాపల్లి మారు మూల ప్రాంతంలో ఎట్టకేలకు పట్టుకున్నారు. పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావును, ఆ బృందాన్ని సిపి శంఖబ్రత బాగ్చీ, ఎసిపి నర్సింహమూర్తి అభినందించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: విశాఖ ఆర్‌కె.బీచ్‌లో మంగళవారం ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మహారాణిపేట పోలీసుల కథనం మేరకు కంచరపాలెంనకు చెందిన యువతి ఇంట్లో గొడవల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు బీచ్‌కు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆ విషయమై 112కు ఫిర్యాదు చేయగా పోలీసులు అప్రమత్తమయ్యారు. బీచ్‌రోడ్డులోని సాగర తీరం వద్ద యువతిని గుర్తించి, కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి- నాతవరం : మండలంలోని చమ్మచింత గ్రామంలో మంగళవారం పోలీసుల వాహన తనిఖీల్లో నలుగురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. వివరాలివి. నర్సీపట్నం డిఎస్‌పి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ సూచనలతో నాతవరం ఎస్.ఐ వై. తారకేశ్వరరావు, సిబ్బంది చమ్మచింత జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు వ్యక్తులు వాహన తనిఖీలను గమనించి, వెనుదిరిగి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు .వారిని తనిఖీ చేయగా, రూ.రెండు లక్షలు విలువ చేసే ఒక కిలో లిక్విడ్ గంజాయి, ఐదు కిలోల లూజు గంజాయి పట్టుబడింది. నిందితుల నుంచి గంజాయితోపాటు రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వంతల బుజ్జిబాబు, కూతాటి శివకుమార్, మహమ్మద్ ఫురాన్, వంతల ఈశ్వర్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఒడిశా నుంచి చమ్మగిరి, రుబ్బసింగి, చిట్టింపాడు, జోగంపేట, తాండవ, కత్తిపూడి మీదుగా తెలంగాణలోని నల్గొండకు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో గుర్తించారు.

ఇంటిలో చోరీకి యత్నం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి లో అడ్వకేట్ తళ్ల సత్యనారాయణ ఇంటిలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి చోరీకి ప్రయత్నించారు. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో పక్కింటి వారు ఎలమంచిలిలో ఉన్న సత్యనారాయణకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం ఇన్స్పెక్టర్ విజయ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇంట్లో ఉన్న సామాగ్రిని పరిశీలించిన ఇంటి యజమాని సత్యనారాయణ, ఇంట్లో ఉన్న వస్తువులు చెల్లాచెదురు చేసినప్పటికీ, దొంగలు ఎటువంటి వస్తువులను తీసుకెళ్లలేదన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- యంత్రాంగం

పద్మనాభం : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భీమిలి నియోజకవర్గంలో మండలానికి 10 వేలు చొప్పున చేపట్టే సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. మండలంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణ ఆధ్వర్యాన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకొస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా పార్టీ ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంతకాల సేకరణను పెద్ద ప్రజా ఉద్యమంగా చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజా వైద్యం ప్రజల హక్కు అనే కరదీపికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పి వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, నాయకులు ఆదిబాబు, బంగారు అప్పడు, ఈశ్వరరావు, ఎ.అప్పారావు, ఎం.అప్పారావు, అప్పలరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 44వ వార్డు పరిధి అక్కయ్యపాలెం నుండి పోర్టు హాస్పిటల్ వరకు హైవే పక్కన జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పాల్గొని విద్యార్థులు, మేధావులు తదితరులతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, బర్కత్ అలీ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, నాయకులు ఎం.సునీల్ కుమార్, పేడాడ రమణికుమారి, నీలి రవి, శ్రీదేవివర్మ, గుజ్జు వెంకటరెడ్డి, బీశెట్టి ప్రసాద్, హబీబ్, బలిరెడ్డి గోవింద్, కె.సుకుమార్, ఐ.రవికుమార్, తరుణ్ పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి సంతకాలు సేకరిస్తున్న కెకె.రాజు

అదాని సిమెంట్‌ను వ్యతిరేకిస్తూ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : అదాని సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఐ గాజువాక నియోజకవర్గ సమితి ఆధ్వర్యాన మంగళవారం పెదగంట్యాడ ప్రధాన రహదారితో పాటు ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తే పెదగంట్యాడ, గాజువాక, గంగవరం అంతా కాలుష్య మయమవుతుందన్నారు. ఇప్పటికే గంగవరం పోర్టు వల్ల ఈ ప్రాంతం కాలుష్యంగా మారిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రజామోదం లేకుండా ఇలాంటి పరిశ్రమలు రావని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు తప్ప అదానీ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు జరగదని చెప్పడం లేదన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి, సీనియర్ నాయకులు టి.సాంబమూర్తి, కె.పోతయ్య, పిల్లా పద్మ, శివ, ఈశ్వరరావు, కృష్ణ, భాస్కరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 86, 87 వార్డుల పరిధిలో నీటి సమస్యకు పరిష్కారం లభించినట్లు 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధం తెలిపారు. 87వ వార్డు పరిధిలోని 12 ఎంఎల్‌డి ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద డిఇ శ్రీనివాసరావు, ఎఇ కేదార్‌నాథ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్నాధం మాట్లాడుతూ, 86, 87 వార్డులకు గతంలో ఒకే పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేసేవారని, ఇప్పుడు రెండు వార్డులకు వేర్వేరుగా చెరో మూడు మోటార్లు అమర్చి నీటి సరఫరాకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, రాజన్‌రాజు, బొట్టా ప్రకాష్, కనకసత్యం, జాన్ రమేష్, సునీల్, పరమానందం, విశ్వేశ్వరరావు, సన్యాసిరావు, సింహాద్రి, వెంకటేష్, సారిపల్లి రాజు పాల్గొన్నారు.

గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షులు దాడి అప్పారావు మృతి



ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షులు దాడి అప్పారావు (76) మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఆరిలోవ హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దీర్ఘకాలంగా గోపాలపట్నం వర్తక సంఘం అధ్యక్షునిగా పనిచేస్తున్న అప్పారావు కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా 25 సంవత్సరాలు పని చేశారు. మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా ఉన్న సమయంలో బ్యాంకు పాలకవర్గ డైరెక్టర్‌గా అప్పారావు పని చేశారు. తెలుగుదేశం పార్టీలో గోపాలపట్నం ప్రాంతంలో క్రియాశీలంగా వ్యవహరించారు. అప్పారావు అంత్యక్రియలు బుధవారం గోపాలపట్నంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే గంటాకు చిరువ్యాపారుల వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధి చిట్టివలస ఇఎస్‌ఐ ఆసుపత్రి ప్రహరీకి అనుకుని ఏళ్ల తరబడి ఉన్న తమ బడ్డీలను ఇటీవల అధికారులు తొలగించి ఉపాధికి దూరం చేశారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు స్థానిక క్యాంప్ కార్యాలయంలో బాధిత చిరు వ్యాపారులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బడ్డీల తొలగింపుతో దాదాపు 50 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, నేటి వరకు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించలేదని వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, సహాయ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన వారిలో మూర్తి, అప్పల నాయుడు, నీలాటి రాము, బాధిత చిరు వ్యాపారులు నరసింగరావు, కనకరాజు, ప్రసాద్, రామునాయుడు తదితరులు ఉన్నారు

రాజీవ్ గృహకల్ప రోడ్డులో ట్రాఫిక్

ప్రజాశక్తి-కొమ్మాది : మారికవలస రాజీవ్ గృహకల్ప సర్వీస్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. మూడు రోజులుగా స్థానికులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తురకపాలెం మృతులకు రూ.25 లక్షలు చెల్లించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : గుంటూరు తురకపాలెంలో కలుషిత నీరు తాగి మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. విశాఖ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చెల్లించి తురకపాలెం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలే చెల్లించడం తగదన్నారు. నష్ట పరిహారం చెల్లింపులో ప్రభుత్వం వివక్ష చూపిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన మరణాలకు కేవలం రూ.5 లక్షలు మాత్రమే చెల్లించి బాధ్యత నుండి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తురకపాలెంలో వింత వ్యాధితో 40 మందికి పైగా మరణిస్తే ఘటన జరిగి నెలలు గడిచినా మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలనే కనీస స్పృహ ప్రభుత్వానికి రాలేదన్నారు. గత నెల 14వ తేదీన విదసం ప్రతినిధులు తురకపాలేన్ని సందర్శించి, బాధితులను కలెక్టరు వద్దకు తీసుకెళ్లి నష్ట పరిహారంపై ప్రశ్నించినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని జాతీయ ఎస్‌సి కమిషన్ మెంబర్ రామ చంద్ర, డైరెక్టర్ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం మొక్కుబడిగా రూ.5 లక్షలు చొప్పున చెల్లించి చేతులు దులిపేసుకుందని విమర్శించారు. తురకపాలెం ఘటనపై హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, యుఎస్.రాజు, సిహెచ్.దాలయ్య, కస్తూరి వెంకటరావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధ ధర్మ చక్ర పరివర్తన దినోత్సవం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన దినాన్ని స్మరించుకుంటూ బౌద్ధ ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

ప్రజాశక్తి -కరాస : జివిఎంసి 52వ వార్డు గౌతమ బుద్ధ ధ్యానవనం కమిటీ సభ్యులు ధర్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎడి జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పూలమాల వేసి ర్యాలీ చేపట్టారు. శాంతినగర్, నేతాజీ కాలనీ మీదుగా తథాగత గౌతమ బుద్ధ ధ్యానవనం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. తథాగత గౌతమ బుద్ధ ధ్యాన వనాన్ని జియ్యాని శ్రీధర్ దంపతులు కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు.

అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా బౌద్ధ ధమ్మం విరాజిల్లిందని ప్రముఖ బుద్ధ బిక్కువు బంతేజ ఆనాలియో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, కెబిఆర్.అంబేద్కర్, మాటూరి శ్రీనివాసరావు, దుర్గారావు, మాటూరి రత్నకుమారి, పాలేటి పెంటారావు, సినీ నిర్మాత దర్శకుడు సత్యారెడ్డి, కారెం వినయ్‌ప్రకాష్, టి.శ్రీరామ్మూర్తి, గొండు నవీన్, డాక్టర్ బూసి వెంకటరావు, కొరివి సుందరరావు, బాలయోగి, సోడదాసి సుధాకర్, భాస్కరరావు, సింహాద్రి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీమార్గం అనుసరణీయం

జెఎన్‌యు విశ్రాంత ప్రొఫెసర్ మృదుల ముఖర్జీ

ప్రజాశక్తి-మధురవాడ : మహాత్మాగాంధీ ఆలోచనలు నేటి ప్రపంచంలోనూ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని, ముఖ్యంగా ఆయన జీవిత ప్రయాణం, సంభాషణా శైలిని లోతుగా అర్థం చేసుకునేవారికి గాంధీమార్గం ఆచరణీయమని ప్రముఖ చరిత్రకారిణి, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (జెఎన్‌యు) న్యూఢిల్లీకి చెందిన చరిత్ర అధ్యయన కేంద్రం మాజీ ప్రొఫెసర్ మృదుల ముఖర్జీ చెప్పారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో 'గాంధీ కలల స్వరాజ్ – ఆధునిక భారతంపై పరిచింతనలు' అంశంపై మంగళవారం ఆమె ఉపన్యాసం ఇచ్చారు. గాంధీ స్వాతంత్య్ర పోరాటంలోని వివిధ దశలను వివరించారు. గాంధీ ప్రజలను ఆకర్షించేలా మాట్లాడటానికి సంప్రదాయ పదాలను ఎంత సరళంగా, బాగా వాడారో వివరించారు. గాంధీ అన్ని మతాలూ సమానమేనని నమ్మారన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంక్షోభ సమయంలో గాంధీ సిద్ధాంతాలు మరింతగా ఆచరించబడుతున్నాయని, వాటి ప్రాధాన్యత ఎంత ఉందో ఆమె వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఆమె ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని గాంధీ సిద్ధాంతాలు, వాటి నేటి ప్రాముఖ్యతపై వచ్చిన అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం మృదుల ముఖర్జీని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ సుష్మారాజ్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

హాస్టల్‌కు గ్యాస్ స్టౌ అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : సుందరమ్మ రామన్నచెట్టి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి అశోక్ చక్రవర్తి సొంత నిధులతో సమకూర్చిన డబుల్ బర్నర్ కమర్షియల్ గ్యాస్ స్టౌను మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో స్థానిక క్యాంప్ కార్యాలయంలో మధురవాడ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.ప్రసాదరావుకు అందజేశారు. సామాజిక కార్యక్రమాలకు, సంక్షేమానికి ట్రస్ట్ చేపడుతున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు.

కొవ్వాడను సందర్శించిన జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి పి.నారాయణమూర్తి మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, తడి -పొడి చెత్త వేరుచేయడం, చెత్త నుండి సంపద కేంద్రాల నిర్వహణ పనితీరు, వాటర్ ట్యాంక్ శుభ్రత, క్లోరినేషన్, గ్రామంలో పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి నిర్మలాదేవి, మండల అభివృద్ధి అధికారి కె.రూపేష్, డిప్యూటీ ఎంపిడిఒ కె.రమేష్‌నాయుడు, గ్రామ పంచాయతీ అధికారులు, పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో భీమిలి లోని ప్రాచీన కట్టడాల పరిసరాలలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పురాతన కట్టడాల పరిరక్షణతో పాటు సందర్శకుల కోసం ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆవశ్యకతను గీతం ఆర్కిటెక్చర్ డీన్ బిభూతి ప్రస్ప దేవ్ స్థానికులకు వివరించారు. భీమిలిలోని ప్రాచీన కట్టడాల ప్రాచుర్యానికి, పరిరక్షణకు, పరిశుభ్రమైన వాతావరణానికి గీతం ఆర్కిటెక్చర్ విభాగం కృషి చేస్తోందని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాచీన కట్టడాల పరిసరాల్లో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మద్రి జ్యోతి ఆధ్వర్యంలో 30 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. స్థానిక మత్స్యకార నాయకులు కర్రి చిన్నారావు, గంటా నూకరాజు, సాగర వికాస సంఘం సిఇఒ శ్రీనివాసకుమార్ గీతం విద్యార్థులను అభినందించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళ శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు నేతలు కుమార్, గనిశెట్టి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నుండి జరుగుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ విద్యుత్ కార్మికులకు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంవత్సర కాలంగా పలు దఫాలు ఎపిఇపిడిసిఎల్, సిపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ పరిధిలో సిఎమ్‌డిలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. చలో విద్యుత్ సౌధా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. దీంతో సమ్మె అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ కార్మికుల డిమాండ్లను తెలియజేశారు. ఇప్పటికే దేశంలో అనేక చోట్ల విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను గుర్తుచేశారు.

పరవాడ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15 నుండి కార్మికులు చేసే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం జెఎన్ ఫార్మాసిటీలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు అన్ లిమిటెడ్ వైద్య సౌకర్యం కోటి రూపాయలు ఇన్సూరెన్స్ పథకం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్, పి.అప్పారావు, బి.నరసింగరావు, ఎం రమణరావు, కే త్రినాథ్, కే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ జేఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులందరికీ ఏపీఎస్‌సిబి సర్వీస్ రూల్స్‌ను వర్తింప చేయాలని, జన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని కోరారు. కార్యక్రమంలో సుందరపు రామన్న దొర, కర్రి భాను, మద్దాల జగన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నేత గనిశెట్టి, కార్మికులు

సిజెఐ గవాయ్‌పై దాడి హేయం

ప్రజాశక్తి-పరవాడ : భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బీఆర్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్ దాడికి వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో లంకెలపాలెం జంక్షన్లో మంగళవారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్‌పై దాడి అత్యంత హేయమైనదని పేర్కొన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ ఉన్మాదిని దేశద్రోహిగా పరిగణించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదం రెచ్చగొడుతుందని, ఆ ప్రభావంతోనే రాకేష్ లాంటి వాళ్లు పెట్రేగిపోతున్నారని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు మైనార్టీలపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేయడంతో పాటు వారి హక్కులను కూడా హరిస్తున్నారని తెలిపారు. సనాతనధర్మం పేరుతో మతోన్మాదులు దేశాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గాలను ఎదిరిస్తున్న వాళ్లపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇది రాజ్యాంగంపై దాడిగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే.వెంకట్రావు, పెంటారావు, రమణ, సత్తిబాబు, సూరిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్ చికిత్సతో గుండెపోటు నివారణ

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) ద్వారా గుండెపోటు నివారించవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ లావణ్య అన్నారు. అనకాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు సిపిఆర్‌పై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఆర్ అంటే ఒక వ్యక్తి శ్వాస తీసుకోవడం లేదా గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర ప్రాథమిక చికిత్స అని తెలిపారు. గుండె మెదడు ముఖ్య అవయవాలకు రక్తం సరఫరా అయ్యేలా చేయడానికి ఛాతి కుదింపులు, రెస్క్యూ శ్వాస కలయికను చేసేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్ట్ గణేష్, పాల్గొన్నారు.

నేడు ఏటికొప్పాకకు నాగబాబు రాక

ప్రజాశక్తి-యలమంచిలి : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు బుధవారం ఏటికొప్పాకను సందర్శించనున్నారు. ఎమ్మెల్యే విజయకుమార్, ఉత్తరాంధ్ర జనసేన పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి వెంకట సతీష్‌లతో కలిసి ప్రసిద్ధిగాంచిన లక్కబొమ్మల తయారీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుంటారని స్థానిక జనసేన నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, కొటారు శ్రీను, నగిరెడ్డి నరేష్ తెలిపారు.

ప్రత్యేక వాహన తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో అనకాపల్లి శారదా బ్రిడ్జ్ వద్ద పోలీసులు మంగళవారం ప్రత్యేకంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో రెండు ఆటోల్లో పరిమితికి మించి స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న వాటిని గుర్తించారు. ఒక ఆటోలో 11 మంది, మరో ఆటోలో 13 మంది విద్యార్థులు ఉండడంతో ఆ రెండు ఆటోలపై బిఎన్ఎస్ 125 ప్రకారం కేసులు నమోదు చేశారు. సంబంధిత ఆటో డ్రైవర్ లైసెన్సులను రద్దు చేయడానికి అనకాపల్లి ఆర్టీఓ కార్యాలయానికి పంపించినట్లు వెల్లడించారు.



ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న సిఐ వెంకటనారాయణ

'గూగుల్' ఒప్పందంపై సంబరాలు



సత్యం కూడలిలో బాణసంచా కాల్చుతున్న టిడిపి నేతలు

నర్సీపట్నం టౌన్ : విశాఖపట్నం నగరంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు అవగాహన ఒప్పందాలు కుదరడంపై నర్సీపట్నంలో యువత బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు, లాలం మురళీకృష్ణ, నలబెల్లి స్వామి, యువత పాల్గొన్నారు.

డిజిటల్ రాజధానిగా విశాఖ : ఎమ్మెల్యే రాజు

చోడవరం : విశాఖపట్నం డిజిటల్ సిటీ రాజధానిగా మారనుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విశాఖలో గూగుల్ వంటి సంస్థలను ఏర్పాటు చేయడంతో వాటికి అనుబంధంగా ఎన్నో ఐటీ కంపెనీలు రానున్నాయని, దీంతో ఎంతోమంది యువకులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ సంస్థతో చేసుకున్న ఒప్పందంపై మంగళవారం సత్యం కూడలి వద్ద వి.ఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బిజెపి నాయకులు శ్యామల దీపిక, సునీల్ అగ్రవాల్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : గూగుల్ ఏఐ హబ్ పేరుతో ఎపి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంపై దేవరాపల్లిలోని రైవాడ జలాశయ అతిథి గృహం వద్ద మంగళవారం సాయంత్రం టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడు నాయుడు, శరకాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటి విశ్వనగరంగా విశాఖ : గంటా

మధురవాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి లోకేష్ కృషితో ఐటిలో విశాఖ విశ్వనగరంగా మారబోతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లలో హైదరాబాద్ ఐటి సాధించిన అభివృద్ధిని విశాఖ 10 ఏళ్లలోనే అందుకోబోతోందని తెలిపారు. మరోవైపు డేటా సెంటర్లకు విశాఖ కేరాఫ్ అడ్రస్ స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డైట్ ప్రొఫెసర్‌కు బెస్ట్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకట ఫణిబాబు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు -2025ను అందుకున్నారు. డైట్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆయన డీన్ అకడమిక్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో నిర్వహించింది. వివిధ రాష్ట్రాల, పలు దేశాల నుండి సుమారు 2000 మంది ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అభ్యర్థులలో ఫైనలిస్టులుగా ఎంపికైన వారిలో డాక్టర్ వి.వెంకట ఫణి బాబు మొదటి స్థానం సాధించి ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. దాడి విద్యాసంస్థల ఛైర్మన్ దాడి రత్నాకర్ డాక్టర్ ఫణిబాబుని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డైట్ ప్రధాన మండలి సభ్యులు, అధ్యాపక బృందం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో రూ.3 వేలు జరిమానా

ప్రజాశక్తి-పరవాడ : కానిస్టేబుల్‌పై దాడి చేసిన కేసులో ముద్దాయికి అనకాపల్లి 11వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ రూ.3వేలు జరిమానా విధిస్తూ ఈనెల 13న తీర్పు వెల్లడించారు. విధి నిర్వాహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పాతాళం అచ్చం నాయుడుపై మండలంలోని రావాడ గ్రామానికి చెందిన షేక్ చిన్నారావు 2019లో దాడికి పాల్పడ్డారు. దీనిపై పరవాడ పోలీస్ స్టేషన్‌లో నాడు క్రైం నెంబర్ 246/2019, ఐపిసి సెక్షన్ 353 (పోలీసు విధి నిర్వాహణలో అడ్డంకులు కల్పించడం, దాడి) కింద నమోదు చేయబడింది. కోర్టు విచారణ అనంతరం దోషిగా తేలడంతో న్యాయమూర్తి రమేష్ ముద్దాయికి రూ.3,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ కారాగార శిక్ష విధించారు. ఈ కేసును సబ్ ఇన్‌స్పెక్టర్ ఐ.గోపి దర్యాప్తు చేయగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్ విష్ణు పర్యవేక్షించారు. కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాలిని వాదనలు వినిపించారు.

ఎన్‌టిపిసి ప్రాంతంలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊటగెడ్డ ఎన్‌టిపిసి ప్రాంతంలో సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. మ్యాన్‌పవర్ కాంట్రాక్టర్ల ద్వారా ఎన్‌టిపిసి పరిసర ప్రాంతాల్లోని కంపెనీలకు కార్మికులను గూడ్స్ వాహనాల్లో అనధికారికంగా తరలిస్తున్న మూడు వాహనాలను గుర్తించారు. సంబంధిత వాహనాలను మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకుని, డ్రైవర్లపై రూ. 18,000 అపరాధ రుసుము విధించారు. వాహనాలను పరవాడ పోలీస్ స్టేషన్‌లో జమ చేశారు. గూడ్స్ వాహనాల్లో కార్మికులను తరలించడం అత్యంత ప్రమాదకరమని, సంబంధిత కంపెనీ యాజమాన్యాలు తమ మ్యాన్‌పవర్ కాంట్రాక్టర్లకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని పోలీసులు సూచించారు.

గంబూషియా చేపలు విడుదల

ప్రజాశక్తి-కశింకోట : దోమల నివారణకు కశింకోట మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలోని చెరువులో గంబూషియా చేపలను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర, కశింకోట పీహెచ్సి సిబ్బంది సత్య నారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులో గంబూషియా చేపలు వదులుతున్న డిఎంహెచ్‌ఓ

కాల పరిమితి సర్క్యులర్ నిలుపుదలపై విఓఎల విజయోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : వెలుగు విఓఏల కాల పరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం నిలుపుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఏపీ వెలుగు వివోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం సిఐటియు కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచుకొని వివోఏలు సిఐటియు నాయకులు ఆనందాన్ని వెలిబుచ్చారు. ఈ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి, జిల్లా గౌరవ అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ విఓఎలను మూడు సంవత్సరాల పూర్తయిన వారిని తొలగించాలనే గత ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని గత ఆరేళ్లగా అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సర్క్యులర్ నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల రాజకీయ వేధింపులు, తొలగింపులు జరక్కుండా నిలువరించవచ్చని పేర్కొన్నారు. మిగిలిన సమస్యల పట్ల కూడా ప్రభుత్వ సానుకూలంగా స్పందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఆన్లైన్ వర్క్‌లకు 5జి మొబైల్‌తో పాటు డేటాను ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు, ప్రతినెల 5వ తేదీ నాటికి గౌరవ వేతనం చెల్లింపు, గ్రూప్ ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, హెచ్ఆర్ పాలసీ అమలు వంటి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కేక్ కట్ చేస్తున్న సిఐటియు నేతలు, విఓఎలు

ఇంటి పన్నుల సొమ్ము స్వాహా

డిపిఒకు పంచాయతీ ఇఒ, ఎంపిడిఒ ఫిర్యాదుతో వెలుగులోకి..

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రం దేవరాపల్లి మేజర్ పంచాయతీలో ఇంటి పన్నుల సొమ్ము స్వాహా జరిగినట్లు తెలిసింది. ఇక్కడ బిల్లు కలెక్టరుగా పనిచేసిన జె.జోగిరాజు ఈ నిధులు స్వాహా చేశాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లు కలెక్టర్‌పై పంచాయతీ ఈఓ బిఏ అనంత ఉమాదేవి, ఎంపీడీఓ ఎం.వి.సువర్ణరాజు విడివిడిగా జిల్లా పంచాయతీ అధికారికి లిఖిత పూరకంగా ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై స్థానిక పాత్రికేయులు పంచాయతీ ఇఒ అనంత ఉమాదేవిని వివరణ కోరగా... ఆమె తెలిపిన వివరాలు ప్రకారం...

అనకాపల్లి జిల్లా మునగపాక పంచాయతీలో బిల్లు కలెక్టరుగా పనిచేస్తూ జె.జోగిరాజు గతేడాది అక్టోబరు నెలలో బదిలీపై దేవరాపల్లి పంచాయతీకి వచ్చారు. ఆయన అక్కడ పనిచేసిన కాలంలో వివిధ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో అతనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఓ వైపు విచారణ జరుగుతుండగానే ఆయనను దేవరాపల్లికి గత ఏడాది అక్టోబరులో బదిలీ చేశారు. మునగపాకలో ప్రజలు చెల్లించిన ఇంటి పన్నులో రూ.4.45 లక్షలు జోగిరాజు స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. ఈ అభియోగంపై జోగిరాజును ఈ ఏడాది మే 28న జిల్లా పంచాయతీ అధికారి సస్పెండ్ చేశారు. సస్పెన్షన్‌కు గురైన జోగిరాజు దేవరాపల్లి పంచాయతీలో అతని స్వాధీనంలో ఉన్న ఏ రికార్డును నేటి వరకు కార్యాలయానికి అప్పగించలేదు. బీరువా తాళాలను సైతం తన వద్దే ఉంచుకున్నారు. అతని వద్ద నుంచి పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకోడానికి ఈఓ చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అతనిపై దేవరాపల్లి పోలీసు స్టేషన్లో ఈ ఏడాది జూన్ 6న ఆమె ఫిర్యాదు చేశారు. అయితే డిపిఒకు ఎండిపిఒ నుండి ఫిర్యాదు వస్తే తప్ప ఫిర్యాదు స్వీకరించలేమంటూ పోలీసులు చెప్పడంతో పంచాయతీ ఇఒ ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు.

ఇంటి పన్ను డిమాండ్ రూ.13 లక్షలు, జమ చేసింది రూ.6లక్షలు

దేవరాపల్లి పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో 13 లక్షలు ఇంటి పన్ను వసూలు కావలసి ఉంది. గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మే 25 వరకు సుమారు రూ.6 లక్షలు మాత్రమే బ్యాంకులో జమ అయ్యింది. మిగతా సొమ్ము వసూలు అయ్యిందా? లేదా? అనే దానిపై స్పష్టత రావలసి ఉంది. కాగా తమ వద్ద ఉన్న ప్రాథమిక సమాచారంతో ఇంటిపన్ను చెల్లించాలంటూ కొంత మందికి పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఫోను చేస్తే వారు ఇంటి పన్ను చెల్లించిన రసీదు తెచ్చి చూపిస్తుండటంతో పంచాయతీ అధికారులు విస్తుపోతున్నారు. దీంతో మునగపాక పంచాయతీ మాదిరిగానే దేవరాపల్లి పంచాయతీలోనూ ఇంటి పన్ను సొమ్మును బిల్లు కలెక్టరు స్వాహా చేసి ఉంటాడన్న అనుమానాన్ని పంచాయతీ ఇఒ సోమవారం విలేకరుల ముందు వ్యక్తం చేశారు. బిల్లు కలెక్టర్‌పై ఎంపీడీఓకి గత నెల 20న లిఖిత పూరకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇది ఇలా ఉండగా, పంచాయతీ ఇఒ ఫిర్యాదు మేరకు బిల్లు కలెక్టరు జోగిరాజుపై డిపిఒకు ఫిర్యాదు పంపించామని ఎంపీడీఓ ఎం.వి.సువర్ణరాజు తెలిపారు.

పెండింగ్ సమస్యలపై యుటిఎఫ్ ధర్నా నోటీస్



ఇన్‌ఛార్జి డిఇఒకు ధర్నా నోటీసు ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒ కార్యాలయంలో ఇన్ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావుకు మంగళవారం యుటిఎఫ్ నాయకులు ధర్నా నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ 2025 జులైలో పలు సమస్యలను డీఈవో దృష్టికి తీసుకొచ్చినప్పటికీ చాలా సమస్యలు పరిష్కారం కానందున ధర్నా నోటీసు అందజేసినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన ప్రమోషన్లు, బదిలీలు కారణంగా కొత్తగా మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ తెలుగు టీచర్‌గా జాయిన్ అయిన బండారు అచ్యుతకి తగిన వేకెన్సీ పోస్ట్‌ను ఆ పాఠశాలలో మంజూరు చేయకపోవడంతో గత ఐదు నెలలుగా జీతాలు అందక ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన స్పాట్ వాల్యుయేషన్, సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ నేటికీ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. డీఎస్సీ-2025 నియామకాలు పూర్తి అయిన నేపథ్యంలో రిలీవర్ లేక ఇంకా రిలీవ్ కాని ట్రాన్స్‌ఫర్ ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి కావలసిన ప్రపోజల్స్‌ను కమిషనర్‌కు పంపాలని కోరారు. ఇంకా టీచర్లు లేని ప్రాథమిక పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు లేని హైస్కూల్స్‌లో మండలాన్ని ప్రాతిపదికగా తీసుకొని సర్‌ప్లస్ టీచర్ల నుంచి గాని బహుళ టీచర్లు ఉన్న పాఠశాల నుంచి గాని ఆయా ఖాళీ పోస్టులను సర్దుబాటు చేయాలని కోరారు. ఈ సమస్యలను వారంలోగా పరిష్కరించకపోతే డిఈఓ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. దీనికి స్పందించిన ఇన్ఛార్జి డిఇఒ అప్పారావు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ వై.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ పార్వతి, రామలింగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు వత్సవాయి శ్రీలక్ష్మి, రొంగలి అక్కునాయుడు, జిఎస్ ప్రకాష్, మారిశెట్టి వెంకట అప్పారావు, మామిడి బాబూరావు, ఉప్పాడ రాము, ఆశ, కరుణ జ్యోతి, రవి, నూతన్, శంకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతుగా నిరసన



నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, మత్స్యకారులు

ప్రజాశక్తి-రాంబిల్లి : బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా రాంబిల్లి మండలం, గజరెడ్డిపాలెం గ్రామంలో మత్స్యకారులు సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. బల్క్ డ్రగ్ ఫార్మా కంపెనీలు పెట్టొద్దని, మత్స్యకారుల పొట్ట కొట్టొద్దని, తీర ప్రాంతాన్ని కాపాడాలని పెద్ద పెట్టిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ తీర ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు ఎరిపిల్లి రాము, ఎరుపెల్లి నూకరాజు, చేపల కాసుబాబు, చెల్లూరు దావీద్ పాల్గొన్నారు.

ఎర్రవరంలో ప్రబలిన వైరల్ జ్వరాలు

ప్రజాశక్తి-యలమంచిలి : ఇటీవల కురిసిన వర్షాలకు మున్సిపాలిటీలోని ఎర్రవరంలో వైరల్ జ్వరాలు ప్రబలాయి. అత్యవసర వైద్య సేవలు అందించాలని స్థానికులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కోరడంతో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాధితులను డాక్టర్లు పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. పరిసరాల పరిశుభ్రత పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి పిఏసిఎస్ చైర్మన్ మోటూరు గోపీనాథ్, టిడిపి క్లస్టర్ కో కన్వీనర్ కరణం రవికుమార్, ఆసుపత్రి డైరెక్టర్ పిట్టా సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ గొర్లె సత్తిబాబు, ప్రగడ మహేష్ ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బిఎల్ఒలకు ఒక రోజు శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్ఒలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దారు అర్జున్‌రావు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్ నమోదు, ఓటర్ల తొలగింపు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శివ, ఎన్నికల విఆర్వో జాన్ఎ, న్నికల ఆపరేటర్ ఓ.సుధారాణి, పలువురు విఆర్వోలు పాల్గొన్నారు.

తామరం భూములపై పరస్పరం ఫిర్యాదులు

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండలం తామరం గ్రామం వద్ద సర్వే నెంబరు 61/3లో గల 21 ఎకరాల భూమి ఆక్రమణ జరిగిందంటూ వైసిపి, టీడీపీ నాయకులు పరస్పరం తహశీల్దారు వెంకటరమణకు మంగళవారం ఫిర్యాదులు అందజేశారు. కాలువకు సంబంధించి భూములను సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని మండల టిడిపి అధ్యక్షులు రుత్తల ఎర్రాపాత్రుడు ఫిర్యాదు చేయగా, అదే నెంబరు గల భూమి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని వైసిపి మండల అధ్యక్షులు చిటికెల వెంకటరమణ పలువురు వైసిపి నాయకులతో కలసి ఫిర్యాదు చేశారు.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : స్టాక్ మార్కెట్లో పెట్టుబడులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి. శంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ శిక్షకులు ఎం.శ్రీను విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీటికి సంబంధించిన పుస్తకాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, వాణిజ్య విభాగాధిపతి ఎం.గోవిందరావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వి.రజని, చరిత్ర అధ్యాపకులు ఎల్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : విద్యుత్తు ప్రమాదంలో గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిట్టియ్యపాలెం గ్రామానికి చెందిన బుదిరెడ్డి మురళిని శివనాగులపేట మైక లైటింగ్ యూనియన్ రాజాం కొండ్రం జోన్ సభ్యులు మంగళవారం పరామర్శించి, రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. తోటి సభ్యుడు గాయపడడం బాధాకరమని, వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మరిసా నరేష్ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లిలో బాణసంచా తయారీ కేంద్రంలో మంగళవారం ఫైర్, పోలీసు, రెవెన్యూ శాఖల సంయుక్త బృందం తనిఖీ నిర్వహించింది. తయారీ ప్రక్రియలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పేలుడు పదార్థాల నిల్వ, కార్మికుల రక్షణ పరికరాలు, అగ్నిమాపక పరికరాల లభ్యత వంటి అంశాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ పి.లక్ష్మీదేవి ఆదేశించారు. ఈ తనిఖీలో ఫైర్ ఆఫీసర్, కానిస్టేబుల్ రమేష్, పిఆర్ఎఓ తదితరులు పాల్గొన్నారు.



బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హెచ్చరిక బోర్డులు తొలగిస్తే క్రిమినల్ కేసులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెంలో ప్రభుత్వ గెడ్డవాగులో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని స్థానిక ఆర్ఐ బి.వీరయ్య స్పష్టం చేశారు. మండలంలోని గొల్లల పాలెం రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 249లో 69 సెంట్లు గెడ్డ వాగు ఉంది. ఈ గెడ్డ వాగులో ఆ గ్రామానికి చెందిన కొంతమంది షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. దీంతో రెవెన్యూ అధికారులు ఈ నెల 10న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని సంఘటన స్థలానికి వెళ్లగా, రెవిన్యూ సిబ్బందిని భూకబ్జాదారులు అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బంది మంగళవారం మళ్లీ ఆ స్థలానికి వెళ్లి ఆక్రమణ దారుల వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అని అడిగారు. వారు ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో, రెవిన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ గెడ్డవాగుగా నిర్ధారించి, ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే బోర్డులు ఏర్పాటు చేసిన గంట వ్యవధిలోనే భూకబ్జాదారులు హెచ్చరిక బోర్డులను మాయం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక ఆర్ఐ వీరయ్య స్పందిస్తూ హెచ్చరిక బోర్డులను తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : డీఎస్సీ -2025లో ఎంపికైన 26 మంది నూతన ఉపాధ్యాయులు మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు ఎంఇఒ బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలో 31 పోస్టులకు గాను, 26 మంది స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరారని, సెకండ్ గ్రేడ్ టీచర్స్ 2, హిందీ 3 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

పాయకరావుపేట : పాయకరావుపేట టీచర్స్ కాలనీకి చెందిన నామాని షర్మిల మాథ్స్ టీచర్‌గా ఎంపికై మండలంలోని ఎస్.నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ మాథ్స్ టీచర్‌గా సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అందజేసిన మొక్కను ఆ పాఠశాలలో ఆమె నాటారు. పాఠశాల హెచ్ఎం ఝాన్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడలు

ప్రజాశక్తి - యలమంచిలి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ కుందూరు రాజు తెలిపారు. యలమంచిలి కొత్తపేట హైస్కూలులో మంగళవారం జరిగిన మండలస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో బాల బాలికలకు విడివిడిగా ఎంపికలు జరుగుతాయన్నారు. బాలురుకు 17వ తేదీన, బాలికలకు 18వ తేదీన కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, మూర్తి, ఇందిర, శిరీష, విజయ, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

ప్రజాశక్తి -కె.కోటపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మండలంలో 2024 ఏప్రిల్ 1నుండి, ఈ ఏడాది మార్చి 31 వరకూ చేపట్టిన పనులు, వేతన దార్లకు చెల్లింపులపై 17వ విడత సామాజిక తనిఖీపై ఈ నెల 15న ప్రజావేదిక ఏర్పాటు చేశామని ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీఓ అప్పలరాజు తెలిపారు. ఇప్పటికే గతనెల 25 నుండి ఈ నెల14 వరకు సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై గ్రామపంచాయితీల వారీగా గ్రామసభలు నిర్వహించామని చెప్పారు. ఎంపీడీఓ సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ ప్రజావేదిక జరుగుతుందని చెప్పారు.

వన్య జాతి మొక్కల ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యాన వన్య జాతి మొక్కల ప్రదర్శన మంగళవారం ఏర్పాటు చేశారు. దీనిని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో పూర్వీకులు ఉపయోగించిన అనేక మొక్కలను, ఆకు కూరలను ప్రదర్శించారు. నల్లేరు, తూటికూర, పొన్నగంటికూర, వెలగ, మారేడు, తంగేడు, నెలవేము, తదితర అనేక మొక్కలను ప్రదర్శించి వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు రేవతిదేవి, మాధవి, మోహన్, గాయత్రి, ఉమా, జ్యోతిష, రమ్య మొదలగు విద్యార్థులు ఈ మొక్కల గురించి వివరించారు.

శిథిల భవనంలో సచివాలయాలు



నాలుగు ప్రభుత్వ కార్యాలయాలకు వేదికైన శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనం

- నిధులు మంజూరైనా అరకొరగా నిర్మాణాలు
- పాడైన భవనంలో నాలుగు కార్యాలయాలు
- ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ

ప్రజాశక్తి - కొత్తకోట : రావికమతం మండలంలో కొత్తకోట మేజర్ పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 40 ఏళ్ళ కిందట నిర్మించిన ఈ భవనం పూర్తిగా ఐదేళ్ల కిందటే శిథిలమైనప్పటికీ ఇక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులను నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతుండగా, సోమవారం భారీగా శ్లాబు పెచ్చులు పడినప్పటికీ, సిబ్బంది గాయాలు కాకుండా తప్పించుకుని ఊపిరిపీల్చుకున్నారు. ప్రాణ భయంతో శిధిల భవనంలో విధులు నిర్వహించలేమని వారు తేల్చి చెబుతున్నారు. ఇదే భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయంతోపాటు ఒకటి నుంచి మూడు సచివాలయాల సిబ్బంది ఇక్కడే విధులు నిర్వహిస్తు న్నారు .ఐదేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరు కున్నా కనీసం మరమ్మత్తులు చేపట్టక పోవడంతో ప్రత్యామ్నాయ భవనం లేక సిబ్బంది శిథిల భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

అర్థాంతర నిర్మాణంలో సచివాలయ భవనాలు

కొత్తకోట జనాభాకు అనుగుణంగా గ్రామం మూడు సచివాలయాలను ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం, వాటి భవన నిర్మాణాలకు ఒక్కొక్కదానికి రూ.45 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసారు.అయితే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంతోపాటు నిర్మాణాల ప్రా వి_ కి బిల్లులు చెల్లించే పరిస్థితులు లేకపోవడంతో మూడు భవనాలూ అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఒకటో సచివాలయం భవనంఒకటో వార్డు కాపుల దిబ్బ వద్ద నిర్మించగా, రెండవ భవనం వెల్లంకి వీధి కొత్తకోట - మాకవరపాలెం రోడ్డుకు సమీపంలో నిర్మాణం చేపట్టారు. మూడవ సచివాల భవనాన్ని బి ఎన్ రోడ్డు ప్రకాష్ నగర్ దారి లో చేపట్టారు ఒకటో భవనం రెండు అంతస్తులు శ్లాబ్ పూర్తి చేసినా, లోపల, బయట ప్లాస్టింగ్, కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయకుండా మధ్యలో వదిలేసారు.

అలాగే రెండవ సచివాలయం భవనం రెండు అంతస్తులు పూర్తి చేసుకొని బయట ప్లాస్టింగ్ చేయ కుండా వదిలేసారు.మూడవ భవనం నిర్మాణంలో తొలి నుంచి అలసత్వం చోటు చేసుకుంది. కాంట్రాక్టర్ చేసిన పనులను ఎం.బుక్‌లో నమోదు చేయాల్సిన అధికారులు పనులలో నాణ్యత లేదని బిల్లులు ఇవ్వకుండా నిలుపివేశారు. దీనితో ఈ భవనమూ మధ్యలోనే నిలిచి పోయింది. రావికమతం మండలంలో అన్ని గ్రామాలలో సచివాలయ భవనాలు నిర్మాణం పూర్తిచేసుకుని సొంత భవనాల్లోనే నిర్వహిస్తుండగా, కొత్తకోటలో మాత్రం అరేళ్లుగా భవనాలన్నీ అర్థాంతరంగా నిలిచిఉన్నాయి. ఫలితంగా శిథిల పంచాయతీ భవనంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.







కొత్తకోటలో అపంపూర్తిగా ఉన్న మూడు సచివాలయాల భవనాలు

సామాజిక న్యాయం, రిజర్వేషన్లపై విశాఖలో సదస్సు



కెవిపిఎస్ ఆధ్వర్యాన నినదిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-రోలుగుంట :ఈ నెల 18న విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సామాజిక న్యాయం, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ సదస్సును జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం రోలుగుంటలో సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటికే దేశంలోని పలు ప్రైవేటు పరిశ్రమల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయడం లేదని , ఇపుడు ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణతో ఉన్న కొన్ని అవకాశాలు కూడా దూరమౌతాయన్నారు. ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలిక అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, తర్వాత ఆ హామీని అమలు చేయలేదన్నారు. దళితులు, మహిళలపై ఇప్పటికే సనాతన ధర్మం పేరుతో దాడులు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం, రిజర్వేషన్లపై అవగాహనకు నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ సదస్సుకు . పార్లమెంట్ సభ్యులు, డిఎస్ఎస్ఎం జాతీయ అధ్యక్షులు కె.రాధాకృష్ణన్, డిఎస్ఎస్ఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు ముఖ్య అతిధులుగా హాజరవుతారన్నారు. సదస్సును జయప్రదం చేయాలని చిరంజీవి కోరారు.

సొసైటీ సిఇఒపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సభ్యులు

ప్రజాశక్తి-రోలుగుంట : జానకిరాంపురం పిఎసిఎస్ సిఇఒగా పనిచేసే సమయంలోఅవకతకలకు పాల్పడిన సిఇఒ బోళెం కృష్ణపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఇదే సొసైటీ సభ్యులు కిల్లాడ సాంబమూర్తి, గొల్లు నారాయణరావు కోరాఉ. మంగళవారం సొసైటీ చైర్మన్ బలిజి మహారాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానకిరాంపురం కోఆపరేటివ్ సొసైటీలో బోళెం కృష్ణ సిఇఒగా అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై గతంలోనే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 4న నర్సీపట్నం డిసిసిబి బ్యాంక్‌ను దగ్ధం చేస్తామంట పెట్రోల్ తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడగా, మరుసటి రోజున అరస్ట్ చేసి 48 గంటలు రిమాండ్ ఖైదీగా సబ్ జైలుకు పంపించారన్నారు. 72 రోజుల ఖైదీగా ఉండి బెయిల్‌పై వచ్చి మళ్లీ అధికారులతో చేతులు కలిపి కాలయాపన చేస్తున్నాడన్నాడు. సిఇఒ అక్రమాలపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న స్థానిక ఆటో డ్రైవర్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం కలిగొట్ల స్నిగ్ధ శ్రీ దేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇందుకుగాను సంబంధిత ఆటో డ్రైవర్ కృతజ్ఞతలు తెలిపారు

విద్యుత్ కల్పించాలని వినతి

ప్రజాశక్తి- ఆనందపురం : గుడిలోవ గ్రామం కొండపై ఉన్న పురాతన శివాలయం, రంగనాధస్వామి దేవస్థానం వద్ద కరెంట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు భక్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పాండవులు దర్శించిన స్థలంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవాలయాలకు రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తున్నారని, కరెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు వివరించారు. దేవాలయ ప్రాంగణంలో వీధిదీపాలు, బెంచీలు, స్థానపు గదులు, 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ సౌకర్యాలను కల్పించాలని అభ్యర్థించారు. .

ఆశ్రమ విద్యార్థులకు ఫ్లాస్కుల పంపిణీ

- సామాజిక సేవలో మన్యం పాత్రికేయులు

ప్రజాశక్తి- హుకుంపేట: సామాజిక సేవలో మేము సైతం అంటూ హుకుంపేటలోని గిరిజన విలేకర్లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవా సంఘం ఆధ్వర్యంలో హుకుంపేట గిరిజన పాత్రికేయులు మండలంలోని మఠం పంచాయతీ అనాథాశ్రమంలో 80 మంది విద్యార్థులతో పాటు సిబ్బందికి మొత్తం 90 ఫ్లాస్కులను పంపిణీ చేశారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు పి..సూర్యారావు మాట్లాడుతూ, విలేకర్లుగా వార్తాసేకరణతోపాటు సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలనే తలంపుతో ప్రస్తుతం పిల్లల ఆరోగ్య రక్షణకుఫ్లాస్కులు పంపిణీ చేశామని తెలిపారు. రానున్న శీతాకాలంలో వేడి నీళ్ళ తాగేందుకు ఉపయోగపడతాయనే తలంపుతో వీటిని అందజేశామన్నారు.

విద్యార్థులు జీవన పాఠాలు నేర్చుకోవాలి



ఇండక్షన్ మీట్‌లో బహుమతులిస్తున్న అవంతి శ్రీనివాసరావు

ప్రజాశక్తి నర్సీపట్నం : కళాశాలలో అధ్యాపకులు నేర్పే పాఠాలతో పాటు విద్యార్థులు జీవన పాఠాలను అవగతం చేసుకోవాల అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు, మంగళవారం నర్సీపట్నం స్టార్‌హోమ్స్‌లో కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇండక్షన్ మీట్‌లో విజయనగరం జెఎన్‌టియు జెవి డైరెక్టర్ చంద్రభూషణరావు, ఆంధ్ర బెటాలియన్ విశాఖపట్నం కమాండింగ్ ఆఫీసర్ నీరజ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రేరణ కల్పించేందుకు, కొత్త ప్రయాణానికి ఆరంభ సూచికగా ఇండక్షన్ మీట్ నిర్వహిస్తున్నా మన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని పాఠాలు, జీవన పాఠాలు క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు, జేఎన్టీయూ డైరెక్టర్ చంద్రభూషణ్ రావు మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణగా చదువుకుని, కళాశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు, కమాండింగ్ ఆఫీసర్ నేరజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును వృష్టిలో ఉంచుకొని విలువలతో కూడిన విద్యను సముపార్జించాలన్నారు. బ్రహ్మకుమారీస్ సిస్టర్ శృతి మాట్లాడ ప్రతి విషయాన్ని నెగిటివ్‌గా కాకుండా పాజిటివ్‌గా తీసుకుంటూ, ప్రశాంతమైన ఆలోచనలతో మంచి నిర్ణయాలు తీసుకుని భవిష్యత్‌ను చక్కదిద్దు కోవాలన్నారు అనంతరం విద్యార్థులు పలు పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రెటరీ ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎంఇఎస్ నందీష్, డానియల్ రాజు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు



గంభూషియా చేపలు వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో దోమలు ,వాటి లార్వాల నియంత్రణకు బావుల్లో గంభూూసియా చేపలను ఆరోగ్య కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలను లార్వా దశలో నియంత్రించేందుకు వాటిని తినేసే గంబూషియా చేపలను బావుల్లో విడిచి పెట్టారన్నారు.కార్యక్రమంలో తెలుగు యువత మండల నాయకుడు గెడ్డం ఆనంద్, ఎంఎల్‌హెచ్‌పి చంద్రకళ, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యుడు గెడ్డం బాబ్జీ పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో పలు శంకుస్థాపన కార్యక్రమాల్లో బుధవారం చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్‌రాజు పాల్గొంటారని మండల టిడిపి అధ్యక్షుడు కోమటి శంకరరావు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు గుడ్డప గ్రామంలో కోదండరామ రామాలయ శంకుస్థాపన, 9.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ లబ్ధిదారులకు ఫ్యాన్లు,బల్బులు పంపిణీ, కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవం, 10 గంటలకు గర్నికం గ్రామంలో నూతనంగా నిర్మించిన సివిల్ సప్లై గోడౌన్ ప్రారంభోత్సవం, 10.30 గంటలకు మేడివాడ గ్రామంలో కళ్యాణ మండపం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు సర్పంచులు, ఎంపిటిసిలు, కూటమి నాయకులు పాల్గొనాలని కోరారు.

ప్రజల పక్షాన ప్రశ్నిస్తే
గృహ నిర్బంధం దుర్మార్గం

సిపిఎం ఆధ్వర్యాన నిరసన



ఆందోళన చేస్తున్న సిపిఎం శ్రేణులు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : బల్క్‌డ్రగ్ పార్కు వద్దని రాజయ్యపేటలో ఆందోళన చేస్తున్న మత్స్యకారుల పక్షాన ప్రశ్నించిన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజును వారం రోజులపాటు గృహనిర్బంధం చేయడం దుర్మార్గమని సిపిఎం నేత ఈరెల్లి చిరంజీవి మండిపడ్డారు. మత్స్యకారులకు సంఘీభావంగా, సిపిఎం నేతలపై వేధింపులకు నిరసనగా మంగళవారం నర్సీపట్నంలో సిపిఎం నేతలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బల్క్‌డ్రగ్‌పార్కు వద్దని మత్స్యకారులు, ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నా, అధికారులు దూకుడుగా ముందుకు వెళ్లడం, ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోవడం సరికాదన్నారు.

దీనిపై మత్స్యకారుల పక్షాన ప్రశ్నించిన అప్పలరాజును వారంరోజులకు పైగా గృహనిర్బంధం చేయడం దారుణమన్నారు. తక్షణమే మత్స్యకారుల మనోభావాలు, ఆందోళనలను గమనించి, బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయడంతోపాటు నిర్బంధం నుంచి సిపిఎం నేతకు విముక్తి కల్పించాలన్నారు. లేకుంటే మున్ముందు ఆందోళనలు మరింత తీవ్రం కాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివ పాల్గొన్నారు

బల్క్ డ్రగ్ పార్కు వద్దే వద్దు!

ఇటు నిరసనల హోరు

అటు గంగమ్మకు పూజల జోరు



ఆందోళన చేస్తున్న మత్స్యకారులకు పలువురి సంఘీభావం

ప్రజాశక్తి -నక్కపల్లి : అభివృద్ధి పేరుతో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం 31 రోజుకు చేరాయి. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మత్స్యకారుల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, సిపిఎం, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఉపాధిని ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయొద్దన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, సిపిఎం నాయకులు సత్యనారాయణ, సిపిఐ నాయకులు దొరబాబు, జగ్గారావు,సన్యాసిరావు, అర్జున్, మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్, బి బాబ్జి, పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మకు జలాభిషేకం పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

నక్కపల్లి : బల్క్ డ్రగ్ పార్కు రాకుండా అడ్డుకోవాలని రాజయ్యపేట గ్రామానికి చెందిన మహిళలు జలాభిషేకం చేశారు. మంగళవారం పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి సముద్రం ఒడ్డున గంగమ్మ తల్లికి, గ్రామ దేవత నూకతాత, భాగిత్తమ్మకు జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి ఆనుకుని విషతుల్య బల్క్ డ్రగ్‌పరిశ్రమను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, దాంతో తమ బతుకులు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నివసించలేని దుస్థితి నుంచి తమను రక్షించాలని మత్స్యకార మహిళలు గంగమ్మను వేడుకున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : వైద్యానికి ఆర్థికసాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.25లక్షల చెక్కులను మంగళవారం నక్కపల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సిఫార్సులతో సాయం మంజూరైంది. పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణ రావు, మాజీ జెడ్పిటిసి కురందాసు నూకరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీను, దార్ల కృష్ణ, జిల్లా మత్స్యకార నాయకులు గోసల తాతారావు, నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, మండల జనరల్ సెక్రెటరీ రాఘవ, అప్పల రాజు, కొప్పిశెట్టి వాసు, కొంకిపూడి దొరబాబు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, అమలాపురం సర్పంచ్ శంకర్రావు, పీక్కి కొర్లయ్య పాల్గొన్నారు.

సూక్ష్మ కళాకారుని ప్రతిభ
- చెక్కపై అబ్దుల్ కలాం ప్రతిరూపం



చెక్కపై అబ్దుల్ కలాం రూపం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు. బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన ప్రతిరూపాన్ని చెక్కపై అద్భుతంగా తీర్చిదిద్దాడు.

మెరైన్ అవుట్ ఫాల్ టెండర్ల నోటిఫికేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు.బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని 31 రోజులు గా మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే, వారి ఆందోళనకు తలొగ్గిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఒకవైపు బల్క్ డ్రగ్ పనులు ఆపించాలని చెపుతూనే, మరో వైపు ఇక్కడ ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్స్ పార్క్ నుంచి 5.27 మిలియన్ లీటర్ల వ్యర్థ రసాయన జలాలను(మెరైన్ అవుట్ పాల్) సముద్రంలోకి వదలడానికి ఈ నెల 27న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ టెండర్లు పిలవడానికి నోటిఫికేషన్ జారీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

సిఆర్‌జెడ్, కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు లేకుండా ఏవిధంగా టెండర్లు పిలుస్తారన్నారు. 31 రోజులుగా మత్స్యకారులు వేటకు, పనులకు వెళ్ళకుండా ఆందోళన చేస్తుంటే, వారి మనోభావాలు, అభిప్రాయాలు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా టెండర్లు పిలవడం అత్యంత మోసపూరితమన్నారు. తక్షణమే మెరైన్ అవుట్ పాల్ టెండర్లు నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు

దియాకు ఒఎన్‌జి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- ఆనందపురం: న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి దియాకు ఒఎస్‌జి ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కొఠారి గ్రామానికి చెందిన పావని ఏడాదిన్నర వయసున్న కుమార్తె దీయా న్యూమోనియా వ్యాధితో బాధపడుతోంది. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తల్లిదండ్రులు వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక సహాయం కోసం దాతల సహకారం కోరారు. ఈ నేపథ్యంలో ఆనందపురం మండలం గంభీరం గ్రామానికి చెందిన ఒఎస్‌జి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ తక్షణ సహాయంగా రూ.20,300ను కుటుంబ సభ్యులకు అందజేసింది. సంస్థ ప్రతినిధి శివ దళాయి మాట్లాడుతూ, చిన్నారి దీయా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ అప్పారావు, జెవివి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్సు సంబరాలు-2025 గోడ పత్రికను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ డిఇఒ అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సంబరాలు సందర్భంగా నిర్వహించు టెస్ట్, ఇతర కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. విద్యార్థుల్లో సైన్స్ ఆసక్తి పట్ల ఆసక్తి పెంపొందిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవడానికి ఈ సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంఎస్‌వివిఎస్‌పి.వర్మ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18వ తేదీన, మండల స్థాయిలో నవంబర్ 1వ తేదీన, జిల్లాస్థాయిలో నవంబర్ 23వ తేదీన, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సంబరాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది విద్యార్థులు వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదికవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు, జిల్లా నాయకులు ఉమామహేశ్వరరావు, వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 18 నుండి అన్ని హైస్కూళ్లలో నిర్వహిస్తున్నట్టు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వినయ్ విద్యా సంస్థ కరస్పాండెంట్ బత్తుల వాసు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు.

చింతలపూడి పంచాయతీలో రేషన్ స్టాక్ పాయింట్

ప్రజాశక్తి-దేవరాపల్లి

చింతలపూడి పంచాయతీకి ప్రత్యేక రేషన్ స్టాక్ పాయింట్ మంజూరు చేస్తూ అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి అదేశాలు జారీ చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దల కాలం నుండి చింతలపూడి పంచాయతీకి రేషన్ డిపో లేక 12 గ్రామాలకు చెందిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతూ తామరబ్బ పంచాయతీలోని ముకుందపురం గ్రామం వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లే వారని తెలిపారు. గిరిజనుల పోరాట ఫలితంగా దేవరాపల్లి తహశీల్దార్ సియస్ డిటి సిపార్సులు మేరకు ఆర్‌డిఓ చింతలపూడి పంచాయతీలో తాత్కాలికంగా రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి గిరిజనులకు రేషన్ సరుకులు అందించాలని అదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పర్మినెంటుగా డీలర్ షిప్‌ను ఏర్పాటు చేయాలని, అంత వరకు రేషన్ స్టాక్ పాయింట్‌కు ఆర్‌డిఓ ఇచ్చిన అదేశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటుకు సహకరించిన అధికారులకు, పత్రికా మిత్రులకు చింతలపూడి గిరిజన ప్రజలు తరుపున వారు ధన్యవాదాలు తెలియజేశారు.

వడ్డే శోభనాద్రీశ్వరరావుపై పోలీసు చర్య సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయనగరం జిల్లా అడ్డతీగలలో జిందాల్‌కు వ్యతిరేకంగా రైతులు శాంతియుతంగా గడిచిన 113 రోజులుగా చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి వెళ్ళిన రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పట్ల పోలీసుల ప్రవర్తనా తీరు చాలా హేయమైనదని ఎపి రైతు స్వరాజ్య వేదిక కో-కన్వీనర్ బాలు గాడి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల దీక్షా శిబిరం దగ్గరకు వెళ్ళనీయకుండా నడిరోడ్డుపై 83ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తిని గంటలపాటు అడ్డగించి తీవ్రంగా ఇబ్బంది పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల వైఖరి తీవ్ర అక్షేపనీయంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఉన్న విషయం మరచిపోయి పోలీస్ రాజ్యం నడుపుతున్న తీరును ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి వడ్డే శోభనాద్రీశ్వరరావుకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ప్రజలు చేస్తున్న శాంతియుత నిరసన కార్యక్రమాలపై స్పందించి అక్రమ భూ సేకరణలను ఆపాలని బాలు గాడి డిమాండ్ చేశారు.